ప్రజాశక్తి

బుధవారం 12 జూన్ 2024

8+16 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



సిద్ధమైన ప్రధాన వేదిక

కేసరపల్లి ముస్తాబు





కేసరపల్లి వద్ద బ్యానర్లు

నేడు సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గన్నవరం

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామం ముస్తాబైంది. బుధవారం ఉదయం 11.27 గంటలకు ఆయన సిఎంగా ప్రమాణ స్వీకారం చేస్తారు. ఇందుకు కష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఐటి పార్క్ మేధా టవర్స్ ప్రాంతాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దారు. మొత్తం 11 ఎకరాల్లో భారీ వేదికను, ఆవరణలో భారీ టెంట్లను, 36 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సుమారు లక్ష వరకు కుర్చీలు వేశారు. బందోబస్తు కోసం 10 వేల మంది వరకు పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పార్కింగ్ కోసం పలుచోట్ల 56 ఎకరాలను కేటాయించారు. సభా కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రాంగణంలో పలుచోట్ల ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిడిపి, బిజెపి, జనసేన శ్రేణులు తరలిరానున్నాయి. రాష్ట్రంలో కూటమి ఘన విజయానికి ప్రతీకగా ఈ కార్యక్రమం ఉంటుందని టిడిపి వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యఅతిథిగా ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు హాజరుకానున్నారు. గెలుపొందిన కూటమి ఎంఎల్‌ఎలు, ఎంపిలు కూడా వస్తున్నారు. వీరందరికీ ప్రోటోకాల్ ప్రకారం ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాకుండా, భద్రతాపరమైన లోపాల్లేకుండా ఏర్పాట్లు చేశారు. వీటిని రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సభా వేదిక, ప్రాంగణంలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ నిఘా కెమెరాలను అమర్చారు. సభా ప్రాంగణంలో ప్రముఖుల రాకకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వివిఐపిలకు పాసుల ప్రకారం సీటింగ్ కేటాయిస్తారు. రెండు జిల్లాల్లోని అన్ని పట్టణ, గ్రామాల్లో భారీ ఎస్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్రమోడీతోపాటు పలువురు ఎన్‌డిఎ ముఖ్యమంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్య నేతలు హాజరుకానున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు తరలిరానున్నారు. ఈ కార్యక్రమం నేపథ్యంలో కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లోని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను విద్యుద్దీకరించారు.


నియోజకవర్గానికి నాలుగు బస్సులు

ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు ఆర్‌టిసి బస్సుల చొప్పున ఏర్పాటు చేశారు. 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు 80 ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆర్టీసీ కేటాయించింది. టిడిపి నుండి నియోజకవర్గానికి 150 పాసులు ఇవ్వడంతో వారంతా నేరుగా సభా ప్రాంగణానికి చేరుకునేలా ఏర్పాట్లు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

చిరంజీవికి ఘన స్వాగతం



ప్రజాశక్తి-గన్నవరం

మెగాస్టార్ చిరంజీవి మంగళవారం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. బుధవారం జరిగే చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన రాష్ట్ర అతిథిగా పాల్గొననున్నారు. విమానాశ్రయంలో అభిమానులు ఆయనకు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రత్యేక కారులో విజయవాడ వెళ్లారు.



యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా కౌన్సిల్ సమావేశం సందర్భంగా కంచికచర్లలో పతాకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు సంజీవరెడ్డి

విద్యా రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

వార్త 8లో

మంత్రి పదవులపై వీడని ఉత్కంఠ

- ప్రచారంలో బోండా, వెనిగండ్ల, కొల్లు పేర్లు
- పరిశీలనలో సుజనా, వసంత, శ్రీరాం తాతయ్య !

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి, విజయవాడ

టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎంఎల్‌ఎల ఏకగ్రీవ ఆమోదంతో టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బుధవారం మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. కూటమి ఎంఎల్‌ఎల సమావేశం మంగళవారం విజయవాడలోని ఎ కన్వెన్షన్ సెంటరులో జరిగింది. ఈ సమావేశంలో చంద్రబాబును సిఎంగా ఎన్నుకున్నారు. ముందుగా ఆయన టిడిఎల్‌పి శాసనసభా పక్ష నేతగా ఎన్నికయ్యారు. దీనికి ముందుగానే నూతనంగా మంత్రి పదవులు కేటాయింపుపై ప్రకటన ఉంటుందని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉత్కంఠతతో ఎదురు చూశారు. అయితే మంగళవారం అర్ధరాత్రి వరకూ మంత్రి పదవుల కేటాయింపుపై అధికారికంగా ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. దీంతో ఎక్కడికక్కడ స్థానిక నాయకులు తమ నాయకునికి మంత్రి పదవి వరించనుందని, తమకు పార్టీల అధిష్టానం నుంచి ఖచ్చితమైన సమాచారం వచ్చిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం చక్కర్లు కొట్టింది. టిడిపి నుండి కృష్ణాజిల్లా మచిలీపట్నం ఎంఎల్‌ఎ కొల్లు రవీంద్రకు బిసి సంక్షేమ, చేనేత శాఖలు, ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరావుకు జల వనరుల శాఖను కేటాయించినట్లు సోషల్ మీడియాలో పోస్టులు చక్కర్లు కొట్టాయి. ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల్లో టిడిపి తరుపున అత్యధిక మెజార్టీతో గెలుపొందిన బొండా ఉమాకు మంత్రి పదవి ఖాయమని ప్రచారం జరగడంతో విజయవాడలోని ఆయన ఇంటి వద్ద మంగళవారం ఉదయం నుంచే సందడి నెలకొంది. మాజీ మంత్రి వెలంపల్లిపై ఆయన 68,886 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. వెలంపల్లికి వచ్చిన ఓట్లు కన్నా బొండా ఉమాకు వచ్చిన మెజార్టీయే అధికం కావడం గమనార్హం. ఈ నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుంచి ఇదే అత్యధిక మెజార్టీగా నమోదైంది. అంతేగాక కాపు సామాజికవర్గం, రాజకీయ అనుభవం ఉండటం వంటివి ఆయనకు మంత్రి పదవి దక్కేందుకు ఉపయోగపడతాయని అంటున్నారు. 2014లో కూడా విజయం సాధించిన బొండాకు అప్పట్లో మంత్రి పదవి దక్కకపోవడంతో అధినేత చంద్రబాబుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అలాగే గుడివాడ నుండి ఎన్నికైన ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాముకు మంత్రి వర్గంలో చోటు ఖాయమనే చర్చ సాగింది. సామాజిక వర్గాలు, కూటమిలోని పొందికల ఆధారంగా బిజెపి తరుపున విజయవాడ పశ్చిమ నుంచి సుజనా చౌదరి, అలాగే టిడిపి నుండి మైలవరం ఎంఎల్‌ఎ వసంత కృష్ణప్రసాద్, జగ్గయ్యపేట ఎంఎల్‌ఎ శ్రీరాంతాతయ్య పేర్లు పరిశీలనలో ఉన్నాయనే ప్రచారం సాగుతోంది.



బోండా ఉమా



వెనిగండ్ల రాము



కొల్లు రవీంద్ర

కేశినేని భవనం మారిపోయింది



ప్రజాశక్తి-విజయవాడ

నిత్యం రాజకీయ బ్యానర్లతో కళకళ లాడిన కేశినేని భవనం మంగళవారం బ్యానర్లు తొలగించడంతో బోసి పోయింది. ప్రత్యక్ష రాజకీయాల నుండి పూర్తిగా తప్పుకుంటున్నట్లు నాని ప్రకటించిన మరుక్షణమే భవనంలోని బ్యానర్లు తొలగించారు.

20 ప్రాంతాల్లో ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న కార్యక్రమాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు వీలుగా నగరంలో 20 ప్రాంతాలలో ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసి వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రసారం చేసేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నగరంలో ఏర్పాటు చేసిన ఎల్ ఈ డి స్క్రీన్ లను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు పరిశీలించారు. నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం , స్వరాజ్ మైదానం అంబేద్కర్ స్మృతి వనం , పండిట్ నెహ్రూ బస్ స్టేషన్, రైల్వే స్టేషన్ , లెనిన్ సెంటర్, పటమట జడ్పి హై స్కూల్ రైతు బజార్, సింగ్ నగర్ మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింఖానా గ్రౌండ్, విద్యాధర పురం స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణ రైస్ మిల్, సూర్య గోడౌన్, ఎస్ ఆర్ కె ఇంజనీరింగ్ కాలేజ్, అను మై బేబీ హాస్పిటల్ ప్రాంతాలలోను, నిడమానూరు బ్లూ బజ్ గ్రౌండ్స్, కెకెఆర్ గౌతమ్ స్కూల్, సవారిగూడెం - కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కష్ణలంక రాణిగారి తోట మైదానంలలో ఎల్ ఈ డి స్క్రీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రమాద బాధితునికి లోకేష్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఇటీవల షాక్ సర్క్యూట్ అయ్యి ఇల్లు కోల్పోయిన ఎం టి ఎం సి పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన ఎడ్లపల్లి సాంబయ్య అనే బాధితుడికి మంగళవారం చిర్రావూరు గ్రామ టిడిపి అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు రూ. 25వేలను అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి గ్రామ అధ్యక్షులు వీరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదంతో సర్వం కోల్పోయిన యడ్లపల్లి సాంబయ్యకు జరిగిన నష్టాన్ని తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ రూ.25వేల రూపాయలు అందజేశారని ఆయన తెలిపారు. అదేవిధంగా బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు నూతనంగా ఇల్లు నిర్మించేందుకు హామీ ఇచ్చారని శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం గ్రామ నాయకులు, జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కెఎన్ఆర్ మాస్టారుకు సతీవియోగం

ప్రజాశక్తి - మంగళగిరి: మంగళగిరి 11వ వార్డులో వాణి ట్యుటోరియల్ వ్యవస్థాపకులు కొల్లి నాగేశ్వరరావు (కేఎన్ఆర్ మాస్టారు) సతీమణి కొల్లి సామ్రాజ్యం అనారోగ్యంతో హైదరాబాదులో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున కన్నుమూశారు. ఆమె వయసు 60 సంవత్సరాలు. భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. సామ్రాజ్యం మరణం పట్ల వాణి ట్యుటోరియల్స్ మిత్రబృందం, మంగళగిరి- తాడేపల్లి మండల యుటిఎఫ్ శాఖలు, ప్రైవేటు విద్యాసంస్థల అసోసియేషన్ అండ్ ఉపాధ్యాయులు, మంగళగిరి డివిజన్ జనవిజ్ఞాన వేదిక, ఎస్-ఎల్ఎం చైతన్య విద్యాసంస్థల ప్రతినిధులు తదితరులు సంతాపం తెలిపి, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియలు మంగళవారం సాయంత్రం జరిగాయి.

సభ ఏర్పాట్లపై ప్రద్యుమ్న సమీక్ష



ప్రజాశక్తి-గన్నవరం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయాలని కార్యక్రమం సమన్వయ అధికారి ప్రద్యుమ్న అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కార్యక్రమ ప్రత్యేక అధికారులు బాబు ఏ, వీర పాండ్యన్, స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, ఎస్ పి జి ఐజి నవనీత్ కుమార్ మెహతా, అదనపు ఐజి అతుల్ సింగ్, రాష్ట్ర అదనపు డీజీపి బాగ్చి, ఐ.జీ.లు రాజశేఖర్ బాబు, అశోక్ కుమార్, పోలీస్ కమిషనర్ రామకష్ణ, డిఐజి గోపీనాథ్ జెట్టి, కష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీం అస్మిలతో కలిసి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్కు మేధా టవర్స్ సమీపంలో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా కార్యక్రమం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు విచ్చేయనున్నారన్నారని, వారందరికీ ఏ విధమైన అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, అఖిల భారత సర్వీసుల అధికారులు, ప్రత్యేక అతిథులు, వీవీఐపీలు, వీఐపీలు, మీడియా ప్రతినిధులు తదితరులకు సంబంధించిన పాసులను అందించాలని సమన్వయ అధికారులకు సూచించారు. ప్రధాన సభాస్థలికి ఇరువైపులా అతిథులకు గ్రీన్ రూమ్స్, వాష్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు వంటి ముఖ్యులకు మేధా టవర్స్ ప్రాంగణంలో పార్కింగ్ ఏర్పాటు చేయటం జరిగిందని, అచట నుండి వారు నేరుగా సభాస్థలికి చేరుకునేందుకు అప్రోచ్ రోడ్లను నిర్మించడం జరిగిందని వివరించారు. ప్రతి గ్యాలరీకి డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు ఇన్చార్జిలుగా వ్యవహరిస్తారని, త్రాగునీరు, పారిశుద్ధ్యం, మెడికల్ టీం బందాల సభ్యులతో గ్యాలరీల ఇన్చార్జులు సమన్వయం చేసుకుంటూ విధులు నిర్వహించాలన్నారు. సభా ప్రాంగణంతో పాటు వెలుపల జనసంచారం గల ప్రదేశాలలో త్రాగునీరు, మజ్జిగ, ఆహారం అందించాలని సూచించారు.

విమానాశ్రయంలో ప్రధాని రాక ఏర్పాట్ల పరిశీలన

ప్రధాని మోడీ బుధవారం గన్నవరం రానుండడంతో విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి పర్యవేక్షించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీతోను డిజిపి హరీష్ కుమార్ గుప్తా, బిజెపి అగ్రనేతలు సిద్దార్థ్ నాథ్ సింగ్, దగ్గుబాటి పురంధేశ్వరి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్య నారాయణ రాజు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిత్రాశివన్నారాయణ, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ ఈశ్వర, బిజెపి మీడియా ఇంఛార్జి పాతూరి నాగభూషణం, రాష్ట్ర కార్యదర్శి మట్టా ప్రసాద్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురు పాటి కుమార స్వామి, అధికార ప్రతినిధి యామినీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమం రోజున విధులు నిర్వర్తించే అధికారులు గన్నవరం జాతీయ రహదారికి సమీపంలో గల పెట్రోల్ బంకు వద్ద పార్కింగ్ స్థలాన్ని వినియోగించుకోవాలని, వారు ముందుగానే సభా ప్రాంగణానికి చేరుకోవాలన్నారు. డ్యూటీ పాసులు అవసరమైన వారు కష్ణా జిల్లా రెవిన్యూ అధికారి వద్ద పొందాలని, అందుకు ప్రణాళిక ప్రకారం పేర్లను సమర్పించాలని అన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసేంతవరకు సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ అప్పగించిన పనులను బాధ్యతగా నిర్వర్తించాలని ఉన్నతాధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల జాయింట్ కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సభ వీక్షణకు ముమ్మర ఏర్పాట్లు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్య మంత్రి బుధవారం ప్రమాణ స్వీకర మహోత్సవ కార్యక్రమ దృష్ట్యా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో ప్రజాలు ప్రత్యేక ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా వీక్షించుటకు ఏర్పాటు చేసినట్లుగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మలా కుమార్ మంగళవారం రాత్రి తెలిపారు. ప్రజలు బుధవారం ఉదయం 8:00 గంటలనుండి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించుటకు ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా వీక్షించుటకు మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ వారిచే తెలిపిన ప్రదేశాలలో స్టాండింగ్ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు కూర్చుని వీక్షించడానికి వీలుగా టెంట్లు ,కుర్చీల సదుపాయములు ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. మంగళగిరి గౌతమ్ బుద్ధ రోడ్డు లో ఆల్ఫా హొటల్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, అంబేద్కర్ సెంటర్, మంగళగిరి తెనాలి రోడ్డులో రాజీవ్ సెంటర్, మిద్దె సెంటర్ల లో,తాడేపల్లి పరిధిలోని నులకపేట అన్న క్యాంటీన్ సెంటర్, శ్రీ కష్ణ టెంపుల్ ఎదురుగా గల అంజిరెడ్డి కాంప్లెక్స్ వద్ద, ఉండవల్లి సెంటర్‌లో చంద్రబాబు ఇంటికి వెళ్లే దారి కరకట్ట రోడ్ లో, కాజా గ్రామ పరిధిలోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగల బైబిల్ మిషన్ గ్రౌండ్ వద్ద రెండు స్క్రీన్లు, కుంచనపల్లి ప్రాతూరు రోడ్డు జంక్షన్, హెచ్ పి పెట్రోల్ బంక్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్లో రాజేశ్వరి నగర్, నవోదయ కాలనీల పరిధిలో, ఆత్మకూరు పరిధిలోని నిర్మలా స్కూల్ ఆర్చి వద్ద,పై తెలిపిన సెంటర్ లలో ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ఎల్ఈడి స్క్రీన్ ల ద్వారా సౌకర్యంగా వీక్షించుటకు 5 చోట్ల మొబైల్ ఎల్ఈడి లు,మిగతా 9 చోట్ల స్టాండింగ్ ఎల్ఈడి , టెంట్‌లు, కుర్చీల నగర పాలక సంస్థ ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.

కొండాలమ్మ దేవస్థానం కార్యవర్గం రాజీనామా

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామములో ఉన్న కొండలమ్మ అమ్మవారి దేవస్థాన కార్యవర్గం రాజీనామా అందజేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు మంగళవారం తెలిపారు. కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ, గొల్లపూడి, విజయవాడ వారి ఉత్తర్వులు అనుసరించి ధర్మకర్తలమండలి సభ్యులుగా నియమించబడిన ధర్మకర్తల మండలి చైర్మెన్ శేషం వీర వెంకట కష్ణమూర్తి, సభ్యులు పామర్తి వెంకటస్వామి, కొమ్మనబోయిన రవిశంకర్, వల్లూరు వెంకటరావు, బాడిగ లీలా సౌజన్య, నారేపాలెం వెంకట నిర్మల, డోకాల భాగ్యలక్ష్మి, యార్లగడ్డ పావని, యార్లగడ్డ లక్ష్మిలు వారి వ్యక్తి గత కారణాల వలన అమ్మవారి దేవస్థానము ధర్మకర్తల మండలి చైర్మెన్ పదవి, ధర్మకర్తలమండలి సభ్యత్వమునకు రాజీనామా చేశారు. ధర్మకర్తల మండలి రాజీనా మాలను అమోదించ వలసినదిగా కమీషనరు, దేవదాయ ధర్మదాయ శాఖ, గొల్లపూడి, విజయవాడ వారికి నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు.

ఇసుక, మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : పత్రికలు ప్రసార మాధ్యమాలలో అవినీతి అక్రమాలపై వచ్చే వార్తలను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులకు అవనిగడ్డ ఎమ్మెల్యేగా ఎన్నికైన మండలి బుద్ధప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మారిన మట్టి ఇసుక దందాలు కొనసాగుతున్నాయని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని, వివిధ శాఖల అధికారులు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని బుద్ధ ప్రసాద్ కోరారు.

టిడ్కో రుణాల చెల్లింపుపై ఒత్తిడి తగదు : సిపిఎం

ప్రజాశక్తి - గుడివాడ : టిడ్కో రుణ లబ్ధిదారుల రుణాలు కట్టాలని బ్యాంక్ అధికారులు మెప్మా అధికారులు ఒత్తిడి చేస్తున్నారని దాన్ని ఆపాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి కోరారు. గుడివాడ సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ టిడ్కో కాలనీలో అనేక ఇబ్బందులు ఉన్నాయని, డ్రైనేజీ సమస్య, చెత్త సమస్య, వాటర్ సమస్య మొదలైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుండా లబ్ధిదారుల్ని డబ్బులు కట్టమని బ్యాంకులు ఒత్తిడి చేయటం మంచి పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకార సభా వేదిక పరిశీలన



చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసే సభావేదిక పరిశీలిస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్, తదితరులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారానికి హాజర వుతున్న నాయకులు, పార్టీశ్రేణులకు ఏవిధమైన ఇబ్బంది కలుగకుండా అన్నిఏర్పాట్లు జరుగుతున్నాయని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. చంద్ర బాబునాయుడు కేసర పల్లిలో ప్రమాణ స్వీకారం చేసే సభాస్థలిని నందమూరి రామ కష్ణ, టీడీ జనార్దన్, ఇతర నాయకులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. ఈసంద ర్భంగా మాట్లాడుతూ ప్రమాణస్వీకారోత్సవానికి లక్షమంది పైగా హాజరవుతారని అంచనాగా తెలిపారు. ఈసందర్భంగా అనంతపురం, చిత్తూరుజిల్లా పంచాయతీ రాజ్ చాంబర్ నాయకులు రాజేంద్రప్రసాద్ను సత్కరించారు. బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, సగర సాధికార రాష్ట్ర కన్వీనర్ జంగర వీరశ్రీనివాసరావు, మైనారిటీ సెల్ సెక్రటరీ అజ్మతుల్లా, బీసీసెల్ సెక్రటరీ ఫణి, వల్లూరు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో మత్స్యకారులకు స్థానం కల్పించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాష్ట్రంలో నూతనంగా ఏర్పడబోయే మంత్రివర్గంలో మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార జేఏసీ చైర్మన్ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం అవనిగడ్డ లోని మత్స్యకార భవనంలో మత్స్యకార జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన మత్స్యకార సామాజిక వర్గానికి చెందిన ముగ్గురిలో ఒకరికి రాష్ట్రం మంత్రివర్గంలోకి తీసుకోవా లన్నారు. అగ్నికుల క్షత్రియ రాష్ట్ర నాయకులు ఒడుగు శ్రీకాంత్ మాట్లాడుతూ బీసీ కులాలలో అత్యధిక జనాభా కలిగిన మత్స్యకార కులాలు కూటమి పొత్తులో భాగంగా తెలుగుదేశం పార్టీ తరపున మచిలీపట్నం కాకినాడ సీట్లు కేటాయించగా జనసేన పార్టీ నర్సాపురం సీటు కేటాయించిందన్నారు. మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్



217 ను తక్షణమే రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార జేఏసీ నాయకులు కోలా బాలాజీ, సైకం శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, అంద్రాజు శ్రీనివాసరావు, నాగిడి శంకర్, నాగిడి గోవిందు, కోలా వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణ బాబు, నాగిడి అమలేశ్వరరావు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-అవనిగడ్డ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని అవనిగడ్డ లోని రాజీవ్ గాంధీ సెంటర్లో గల అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పదివేలకు పైగా భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ కమిటీ నిర్వహించింది.



అన్నసమారాధనలో పాల్గొన్న ప్రజలు

రియల్ ఎస్టేట్‌కు ఊపు

ప్రజాశక్తి-గన్నవరం : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలయింది. జిల్లాల ఏర్పాటుతో పుంజుకుంటుందన్న ఆశతో కోట్లాది రూపాయలు అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన వారు వడ్డీలు కూడా కట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2022లో కష్ణ జిల్లాను విభజించి రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసింది. జిల్లా ఏర్పాటవు తుందని వార్తలు రావడంతో గన్నవరం నియోజకవర్గ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. ఈ క్రమంలో గన్నవరం కేంద్రానికి చుట్టుపక్కల ప్రాంతాల భూములకు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా గన్నవరం బీబీ గూడెం సూరంపల్లి ముస్తాబాద్, కేసరపల్లి బాపులపాడు,వీరవల్లి, ఆత్కూరు, పరిసరాల్లో భూములు ఎకరా రూ. 1కోట్ల నుంచి రూ.2 కోట్లు పలికాయి. దీంతో ఆ భూముల రైతులు ఆనందపడ్డారు. ఈ ఆనందం మూణ్ణాళ్ల ముచ్చటగా ముగిసిపోయింది. జిల్లా ఏర్పాటు తర్వాత భూములు కొనుగోలు చేసిన వారు లాభాలు రావడంతో కొందరు వెంటనే క్రయవిక్రయాలు జరిపారు. ఇంకా కోట్లలో డబ్బు వస్తుందని ఆశపడ్డ వారికి నిరాశే ఎదురైంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ ప్రజాప్రతినిధులు రియల్ఎస్టేట్ చేసేవారి నుంచి మామూళ్లు ఇవ్వాలని పట్టుపట్టడంతో వ్యాపారులు కనుమరుగయ్యారు. దీంతో ఐదేళ్ల వైసీపీ పాలనలో రియల్ఎస్టేట్ రంగం చతికిలపడింది. భవిష్యత్తును దష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. బైపాస్ నాలుగు రహదారుల నిర్మాణాన్ని చేపట్టింది. జాతీయ రహదారుల విస్తరణ కార్యక్రమాన్ని శ్రీకారంచుట్టింది. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. గన్నవరం మండల కేంద్రంలో ఎకరా రూ.2కోట్ల నుంచి రూ.3కోట్ల వరకు ధరలు పలుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. సూరంపల్లి పరిసర ప్రాంతాల్లో కోట్లాదిరూపాయలతో భూములనుకొనుగోలు చేసి, వాటిని కొనేవారు లేకపూర్తిగా నష్టపోయామని పలువురు రియల్ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. బైపాస్ రహదారి పక్కన కూడా భూములు కొనుగోలు చేశారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు కాబోతుం డటంతో రియల్ఎస్టేట్వ్యా పారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.





ఆలయంలో కవచాల చోరీపై పరిశీలన

ప్రజాశక్తి-మోపిదేవి : టేకుపల్లి రామేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి కవచాలను చోరీ చేసిన దొంగలపై తగిన చర్యలు చేపడతామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. మంగళవారం మోపిదేవి మండలం టేకుపల్లి రామేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారి కవచాలు చోరీ జరిగిన ఘటన తెలుసుకుని వెంటనే దేవస్థానం వద్దకు వెళ్లి పరిశీలించారు. వేద పండితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. చోరీ జరిగిన తీరు సీసీ కెమెరా పుటేజీల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆలయాలు, దేవస్థానాల్లో ఇలాంటి చోరీలు పునరావతం కాకుండా దొంగలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే పోలీసులు సీసీ పుటేజ్ ఆధారంగా ఆధారాలు సేకరిస్తున్నారని, క్లూస్ టీమ్ కూడా వచ్చి ఆధారాలు సేకరిస్తారని, పోలీసుల సహకారంతో రామేశ్వర స్వామి కవచాలు సాధ్యమైనంత త్వరగా రికవరీ చేసి స్వామి వారికి అలంకరించేలా చర్యలు తీసుకుంటామని వెంకట్రామ్ అన్నారు. మోపిదేవి జడ్పీటీసీ మెడబలిమి మల్లి ఖార్జున రావు మండల టిడిపి అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు

ఎవరి వస్తువులకు వారే బాధ్యులు : ఎస్పి



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గన్నవరం మండలం కేసరపల్లి ఐటి పార్క్ వద్ద రాష్ట్ర నూతన ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే ప్రజలు, అభిమానులు, వారి బ్యాగులు, ఇతర లగేజ్లను వారు ప్రయాణం చేసి వచ్చిన వాహనాలలోనే భద్రపరచుకొవాలని కృష్ణా జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి హాజం ́య్యే ప్రముఖుల భద్రత దష్ట్యా ఈ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజానీకం సభాప్రాంగణం లోనికి వారి వెంట ఎటువంటి వస్తువులు తీసుకురాకూదన్నారు.

మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : పరిసరాల పరిశుభ్రత పాటించి, శుక్రవారం డ్రైడే పాటించడం, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త ఉ తీసుకోవడం ద్వారా మలేరియా వ్యాప్తి అరికట్టవచ్చని ఎంపీహెచ్ఎస్ సబా యూనిట్ అధికారి సర్వారాయుడు అన్నారు. మలేరియా వ్యతిరేక మాసోత్స వం పురస్కరించుకుని మంగళవారం ఉయ్యూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో మలేరియా వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలుపుతూ ర్యాలీ ని ర్వహించారు. దోమల ద్వారా ఈవ్యాధి వ్యాప్తిచెందుతుందని, ప ల్లపు ప్రాంతాలు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్లకుండా చేయడం ద్వారా దోమల పెరుగు దల అరికట్టవచ్చుని, దో మలు కుట్టకుండా దోమతెరలువాడి మలేరియా బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. ఆశావర్కర్లు, వారు హెల్త్ సెక్రటరీలు పాల్గొన్నారు.



మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెండింగ్ వేతనాలు మంజూరు చేయకుంటే ఉద్యమం

క్లాప్ ఆటో డ్రైవర్ల ధర్నాలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు

సమస్యను పరిష్కరిస్తామని మేయర్ హామీ



ధర్నా చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్లు

ప్రజాశక్తి - విజయవాడ : పెంచిన వేతనాలతో పాటు పెండింగ్ వేతనాలు తక్షణమే మంజూరు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని క్లాప్ ఆటోడ్రైవర్లు స్థానిక లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. పెండింగ్ వేతనాలివ్వాలని, పెంచిన వేతనాలు అమలు చేయాలని, పని భారం తగ్గించాలని కార్మికులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ధర్నా అనంతరం విజయవాడ నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, లేబర్ కమిషనర్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ... క్లాప్ ఆటో డ్రైవర్లు న్యాయమైన డిమాండ్స్‌ను పరిష్కరించాలని, లేనట్లయితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెంచిన వేతనాలు, పెండింగ్ వేతనాలివ్వాలని డిమాండ్ చేశారు. చాలీచాలనీ వేతనాలతో ఆటోడ్రైవర్ల కుటుంబాలు గడవక తీవ్రకష్టాలు పడుతున్నారని, అయినా రెండు నెలల వేతనాలివ్వకుండా, సమ్మె కాలం ఒప్పందాలు అమలు


ధర్నా చేస్తున్న క్లాస్ ఆటో డ్రైవర్లు

చేయకుండా విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు, 'స్వయంభూ' కాంట్రాక్ట్ సంస్థ క్లాప్ ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ధ్వజమెత్తారు. 25 రోజుల నుంచి క్లాప్ ఆటోలు నగర వ్యాప్తంగా నిలిచిపోయినా, చెత్త తరలింపు ఆగిపోయి, శానిటేషన్ సమస్యలతో నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నా... నగర మేయర్, అధికారులు పట్టించుకోవడం లేదని, ముఖ్యంగా స్వయంభూ కాంట్రాక్ట్ సంస్థ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. గత నెల 10న వేతనాలు ఇస్తామని చెప్పిన కాంట్రాక్టర్ నేటికీ అతీగతీ లేకుండా పోయిందని అన్నారు. ఇప్పటికయినా నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు, కాంట్రాక్ట్ సంస్థ, ఇటు ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలపై అత్యవసర సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది మంది సమ్మెలోకి రావడం ఖాయమని హెచ్చరించారు. క్లాప్ ఆటో డ్రైవర్ల వేతనాల అంశంపై సదరు కాంట్రాక్టర్‌తో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వారి వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని మేయర్, లేబర్ కమిషనర్ తెలిపినట్లు యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్,క్లాప్ ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి కె.కిరణ్, అధ్యక్షులు శివ, రామ్ కుమార్, అనిల్, గోపి, రుద్ర, రామరాజు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పాసులున్న వాహనాలకు మాత్రమే అనుమతి

పోలీస్ కమిషనర్ పిహెచ్.డి రామకృష్ణ

ప్రజాశక్తి - విజయవాడ : బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణీ స్వీకారం చేయబోతున్న కార్యక్రమానికి అనుమతి తప్పని సరి అని నగర సిపి పిహెచ్‌డి రామకృష్ణ అన్నారు. విజయవాడ, ఇతర ప్రదేశాల నుండి గన్నవరం వస్తున్న వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, పాసులు లేని ఇతర వాహనాలు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విజయవాడలో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, అంబేద్కర్ విగ్రహం వద్ద, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్, లెనిన్ సెంటర్, పటమటలోని జెడ్.పి.బాయ్స్ హైస్కూల్, అజిత్ సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింకానా గ్రౌండ్స్, 9.విద్యాధరపురం మినీ స్టేడియం. ఈ ప్రాంతాల నుండి సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రామాన్ని ఎల్.ఈ.డి.స్క్రీన్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నట్లు తెలిపారు. ఆ చుట్టుపక్కల ప్రాంతాల వారు ఆయా ప్రదేశాలకు వెళ్లి కార్యక్రమాన్ని వీక్షించవచ్చని సూచించారు. ఇతర రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, వి.వి.ఐ.పి.లు, వి.ఐ.పి.లు, ప్రముఖులు ఈ రహదారుల గుండా ప్రయాణం చేస్తారన్నారు. వారికి ట్రాఫిక్ పరంగా, భద్రతా పరంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన బందోబస్త్ ఏర్పాట్లు చేశామని, ప్రశాంత వాతావరణంలో పాసులు కలిగిన ఆహ్వానితులు సభా స్థలానికి చేరుకునేలా ఏర్పాట్లు చేసామని తెలిపారు.

విజయవాడ నగరంలోని సాధారణ వాహనములు మళ్ళింపులు

విజయవాడ నుండి ఏలూరు, విశాఖపట్నం వైపునకు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆర్.టి.సి. బస్సులు ఉదయం 5 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు బెంజ్ సర్కిల్ నుండి కంకిపాడు-పామర్రు-హనుమాన్ జంక్షన్-ఏలూరు వైపునకు మళ్లించినట్లు తెలిపారు. ఓల్డ్ పిసిఆర్ జంక్షన్, ఏలూరు రోడ్, హోటల్ స్వర్ణపాలెస్, రామవరప్పాడు రింగ్, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్‌రింగ్ రోడ్డు ఒఆర్‌ఆర్ హనుమాన్ జంక్షన్, ఏలూరు వైపునకు వెళ్లాలని తెలిపారు. గొల్లపూడి, ఔటర్ రింగ్ రోడ్డు, ఒఆర్‌ఆర్, గన్నవరం, హనుమాన్ జంక్షన్ వైపునకు వెళ్లాలన్నారు.

మార్కుల కోసం కాదు.. మార్పు కోసం చదవాలి

ఐపిఇ పూర్వపు డీన్ ప్రొఫెసర్ ఎన్.ఎల్.సాయికుమార్


హాజరైన విద్యార్థులు... (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న సాయికుమార్

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విద్యార్థులు మార్కులు కోసం కాదు మార్పు కోసం విద్యావంతులుగా ఎదగాలని, విద్య పరీక్షలు కోసం కాకుండా విజ్ఞానం కోసం ఉపయోగపడాలని ఐపిఇ పూర్వపు డీన్ ప్రొఫెసర్ ఎన్.ఎల్.సాయికుమార్ విద్యార్థులకు సూచించారు. పీబీ సిద్దార్థ కళాశాలలోని ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గ్రూమింగ్ ఫర్ హైరింగ్ అనే అంశంపై జరిగిన సెమినార్‌లో సాయికుమార్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు, యువత వారు తీసుకునే నిర్ణయాలకు వాటి ఫలితాలకు వారే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులు డ్రీమ్ గర్ల్ లేదా డ్రీమ్ బాయ్‌గా కాకుండా డ్రీమ్ ఎంప్లాయ్‌గా మారాలని సూచించారు. ఒక మంచి ఉద్యోగిగా రాణించాలంటే నిరంతర శ్రమతో పాటు పటిష్టమైన ప్రణాళికతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విద్యార్థులకు సలహా ఇచ్చారు. నేటి తరంలో ప్రొఫెషనల్‌గా ఎదగాలంటే విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యంలో అవగాహన, నిబద్ధత, బావవ్యక్తీకరణ, టీమ్ వర్క్ చాలా అవసరమని సాయికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమానికి కళాశాల డీన్ ప్రొఫెసర్ రాజేష్ సి.జంపాల అధ్యక్షత వహించగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ నాయకులు భాస్కరరావు మృతి



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు, నాదెండ్ల భాస్కరరావు మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసు కున్న మైల వరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు విజయ వాడ లోని ఆసు పత్రిలో ఆయన మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన కుమారులు నాదెండ్ల చెన్నకేశవరావు (కేశిబాబు)ను కలిశారు.

క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ నూతన ప్రచారం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఖరీఫ్ సీజన్ ప్రారంభం సందర్భంగా పంటల బీమాపై అవగాహన పెంచే లక్ష్యంతో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ తమ జాతీయ మార్కెటింగ్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు సంస్థ మార్కెటింగ్ ఇన్‌ఛార్జి ఎం.రాజు తెలిపారు. నగరంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు.. ఈ సమగ్ర ప్రచారంలో ప్రధాన అంశం టీవీ ప్రచారం. అన్నారు. ఇది రుతుపవనాల ప్రారంభంతో రైతులు విత్తడం ప్రారంభించిన వేళ వారికి చేరుతుందని తెలిపారు. ప్రింట్, డిజిటల్, అవుట్‌డోర్ మీడియాలో ఏకకాలంలో చేసే ప్రచారం ద్వారా ఈ టీవీ ప్రచారం మరింతగా రైతులకు చేరుతుందన్నారు. విపరీతమైన వాతావరణ సంఘటనలు తరచుగా ఎదురుకావడంతో పాటు అవి తీవ్రమవుతున్న వేళ రైతులకు ఆర్థిక భద్రతా వలయాన్ని రూపొందించడంలో పంట బీమా ప్రాముఖ్యతను ఈ ప్రచారం ద్వారా తెలియ చేస్తున్నామని తెలిపారు.

చెత్త పన్ను రద్దు చేయాలని వినతి


మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ : చెత్త పన్ను రద్దు చేసి, నగర ప్రజలకు భారం లేకుండా చర్యలు తీసుకోవాలని సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పేర్కొన్నారు. చెత్త పన్ను రద్దు కోరుతూ.. రాబోయే కౌన్సిల్ సమావేశం ఎజెండాలో ప్రతి పాదనను పొందు పరచడం జరిగిందని, దానిని కౌన్సిల్‌లో ప్రవేశపెట్టి తీర్మానాన్ని ఆమోదించడానికి మేయర్ అనుమతి మంజూరు చేయాలని కోరుతూ సత్యబాబు నగర మేయర్‌కు ఆమె చాంబర్‌లో మంగళవారం వినతిపత్రం అందజేశారు. అలాగే సమ్మె చేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల పెండింగ్ వేతనాలతోపాటు వేతనాలు పెంచి డ్రైవర్లను ఆదుకోవాలని కోరుతూ మరొక వినతిపత్రాన్ని మేయర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా తన చాంబర్‌లో సత్యబాబు మీడియాతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తం చర్యల్లో భాగంగా విజయవాడ నగరంలో చెత్త పన్నును నిలుపుదల చేయడానికి నూతన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నివాస గృహాలు, వాణిజ్య సంస్థల నుంచి చెత్త సేకరిస్తున్నామనే పేరుతో గత వైసిపి ప్రభుత్వం యూజర్ చార్జీలను వసూలు చేయడం అత్యంత దారుణమని అన్నారు. ఇటువంటి భారాలకు వ్యతిరేకంగా గత వైసిపి ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి సాగనంపారని గుర్తు చేశారు. నగర ప్రజలకు సరఫరా చేస్తున్న కలుషిత నీటిని తాగి పలు ప్రాంతాల్లో డయేరియా బారిన పడి, పలువురు మృత్యువాత పడ్డారని అన్నారు. ఇటువంటి అత్యంత ప్రాధాన్యత కల్గిన అంశాలపై చర్చించడానికి వెంటనే కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మేయర్‌ను కోరినట్లు సత్యబాబు తెలిపారు. చెత్త పన్ను రద్దుకు పార్టీలకతీతంగా కార్పొరేటర్లు ముందుకు రావాలని కోరారు.

ఆర్‌యుబి పనుల పరిశీలన

త్వరగా పూర్తి చేయాలని అధికారులకు బొండా ఉమా సూచన


ఆర్‌యుబి పరిశీలన అనంతరం మాట్లాడుతున్న ఉమా

విజయవాడ : మధురానగర్‌లోని ఆర్‌యుబి పనులను సెంట్రల్ ఎంఎల్ఎ బొండా ఉమామహేశ్వరరావు మంగళవారం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ సెంట్రల్ నియోజక వర్గంలో మధురానగర్ ఆర్‌యుబిని తాను మొదలు పెడితే దానిని పూర్తి చేయలేని అసమర్థ గత వైసిపిది అన్నారు. మధురానగర్ దేవినగర్ ఫ్లైఓవర్‌ను పూర్తి చేసి ఇటు నుంచి అటు పనులకు, స్కూళ్లకు వెళ్లేవారికి ఉపయోగకరంగా ఉండేలా చేసింది టిడిపి ప్రభుత్వం అని తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలో అని 2019లో ఆనాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో తాను శాసనసభ్యులుగా మధురానగర్ వాసుల చిరకాల స్వప్నమైన డబల్ లైన్ ఆర్‌యుబిని ఆనాడు మంజూరు చేయించారన్నారు. తాను ఎంఎల్ఎగా ఉన్న సమయంలోనే సింగ్‌నగర్ బుడమేరు కింద ఆర్‌యుబిని 9 నెలల్లో మంజూరు చేయించడమే కాకుండా పనులను కూడా పూర్తి చేశామని తెలిపారు. 2019 జనవరిలో శంకుస్థాపన చేసి అప్రోచ్ రోడ్డులకు రూ.18 కోట్లు నిధులను మంజూరు చేసి రైల్వే పార్ట్‌లో వారి నుండి అప్రూవల్ చేయించి పర్మిషన్లు తెచ్చి వర్క్ మొదలుపెట్టి 9 నెలల్లో పూర్తి కావలసిన ఈ డబల్ లైన్ ఆర్‌యుబిని గత వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం జగన్మోహన్ రెడ్డి, స్థానిక ఎంఎల్ఎ అసమర్థత వల్ల ఇంతవరకు పూర్తి కాలేదని అన్నారు. తాత్కాలిక మరమ్మత్తులతో ట్రైలర్‌ను జరుపుతుందని, 20 రోజులు పనులు ఉన్నాయని ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులతో కూడా మాట్లాడినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులు డ్రైన్‌లు, లైట్స్, పెయింటింగ్, పిల్లర్స్ ప్లాస్టింగ్ వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ ఎఇ శ్రీనివాస్‌తో మాట్లాడి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఉమా వెంట కార్పొరేటర్ వీరమాచినేని లలిత, డివిజన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, నెక్కంటి ప్రసాద్, సూరి, సింగం వెంకన్న, ఆత్కూరి జానకి అరవింద, కొండల్ రావు, సిహెచ్.రత్తయ్య, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇద్దరు వీఏఏల సస్పెన్షన్

ప్రజాశక్తి-పెడన : పంట నష్టపరిహారం పంపిణీలో అవకతవకలు పాల్పడిన ఇద్దరు గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ)లను అధికారులు సస్పెండ్ చేశారు. వివరాల్లోకెళితే పట్టణ, రూరల్ మండలంలోని బల్లిపర్రు పంచాయతీ సింగరాయపాలెం గ్రామంలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పంట నష్ట పరిహారంలో అవకతవకలు జరిగిన సంగతి పాఠకులకు తెలిసిందే. అయితే దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఏడిఏ శ్రీనివాసరావును ఆదేశించారు. అయితే విచారణ అనంతరం ఈ నివేదికలో కేవలం బల్లిపర్రు, పెడన అర్బన్ ప్రాంతలకు చెందిన రైతు భరోసా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు(వి ఏ ఏ) ఎస్ హరిత, ఎండి తాజ్ మహమ్మద్ లను మాత్రమే సస్పెండ్ చేస్తూ వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ పద్మావతి సోమవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు.



మండల వ్యవసాయ అధికారి కార్యాలయం

అధికారులను తప్పించేందుకు ప్రయత్నం

ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతులకు పంట నష్టం వాటిల్లడంతో వాటిని గ్రామ స్థాయిలోని వీఏఏ, వీఆర్ఓ అలాగే మండల స్థాయిలోని వ్యవసాయ మండల అధికారి అధికారులు ఈ నివేదికలను తయారు చేయాలి. వీటిని నేరుగా తాసిల్దార్ కు బదిలీ చేయాల్సి ఉంది. ఈ క్రమంలోనే వ్యవసాయ అధికారులు అలాగే కింది స్థాయి సిబ్బంది వారికి అనుకూలంగా ఉన్న నకిలీ రైతుల ఆధార్ నెంబర్లు బ్యాంకు అకౌంట్లు నెంబర్లు జత చేసినట్లు విచారణలో తేలింది. ఇదే విషయంపై గత వారం రోజులు క్రితం ఆయా గ్రామాల రైతులు పట్నంలోని పోలీస్ స్టేషన్లో గతంలో గ్రామంలో జరిగిన పంట నష్టం, అధికారుల రికార్డుల్లో నకిలీ రైతుల పేర్లతో నమోదు చేసిన జాబితాలను ఆధారాలకు చూపిస్తూ మండల వ్యవసాయ అధికారి, కార్యాలయ సిబ్బంది ఇందుకు కారణం అంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును పోలీసులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు బదిలీ చేయడంతో విచారణకు ఆదేశించారు. దాదాపు 36 లక్షల రూపాయలు పైగా ప్రభుత్వ సొమ్ము దారి మళ్లించారని విచారణలో తేలింది. అయితే ఇంత భారీ నగదు కేవలం వీఏఏ (గ్రామ వ్యవసాయ సహాయకులు)లు మాత్రమే వీటికి బాధ్యులని సస్పెండ్ చేయడం సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. అసలు ఈ కుంభకోణంలో అధికారులు కూడా ఉన్నట్లు తెలిసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం సిబ్బందిపై సిబ్బందిని విధుల నుంచి తొలగించడం పట్ల పలువురు రైతులు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ భారీ అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సమగ్రంగా విచారణ జరిపించాలి

జిల్లా రైతు సంఘ కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు

36 లక్షల రూపాయల ప్రజా సొమ్మును అధికారులు, కింది సాయి సిబ్బంది వారికి అనుకూలంగా ఉన్న నకిలీ రైతుల అకౌంట్లకి దారి మళ్లించడం దుర్మార్గం. ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతులకు ప్రభుత్వం అందించే నష్టపరిహారాన్ని దోచుకోవాలని చూస్తే సహించేది లేదు. ఉన్నతాధికారులు మరోసారి సమగ్రంగా విచారించి అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రైతులతో ఆందోళనకు దిగుతాం. మండలంలో ఇంకా 30 శాతం రైతులకు పంట నష్టపరిహారం సొమ్ము జమ కావాల్సి ఉంది. వీటిని ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయాలి.

విమాన ప్రయాణీకులు ముందుగా రావాలి

- విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ ఎం. లక్ష్మీకాంత్‌రెడ్డి

ప్రజాశక్తి-గన్నవరం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు కేసరపల్లిలో విమానాశ్రయం ఎదురుగా ఉన్న ప్రాంతంలో ప్రమాణస్వీకారం చేయనున్న నేపథ్యంలో విమాన ప్రయాణికులు తగు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజయవాడ విమానాశ్రయ డైరెక్టర్ ఎం. లక్ష్మికాంత్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవ వేడుకలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా, పలువురు ప్రముఖులు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతా కారణాలరీత్యా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించే అవకాశం ఉందన్నారు. కావున 12వ తేదీన ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు షెడ్యూల్ చేయబడిన విమానాలలో ప్రయాణించే ప్రయాణికులు 12వ తేదీ ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించారు. ప్రయాణికులే కాకుండా వారిని దించటానికి, తీసుకెళ్లటానికి వాహనాలతో వచ్చేవారు సైతం ఉదయం తొమ్మిదిన్నర గంటలలోపు విమానాశ్రయానికి చేరుకోవాలని లక్ష్మీకాంత్ రెడ్డి కోరారు.



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అంగన్‌వాడీ బడిబాటపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మూడు సంవత్సరాలు నిండిన ప్రతి పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలని తల్లిదండ్రులకు అంగన్‌వాడి సెక్టార్ సూపర్‌వైజర్ మాలతి దేవి సూచించారు. స్థానిక 50వ వార్డు సచివా లయ పరిధిలోగల అంగన్‌వాడీ సెంటర్స్ పంబలగూడెం, ఎండోమెంటేలాండ్స్‌లో మంగళవారం అంగన్‌వాడి బడిబాట కార్య క్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 3 సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్ వాడి సెంటర్లో చేర్పుకోవటం, 5 సంవత్సరాలు నిండిన పిల్లలను ఎలిమెంటరీ స్కూల్లో చేర్పించుట కొరకు తల్లులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్ వైజర్ మాలతి దేవి మరియు అంగనవాడి కార్య కర్తలు నాగమణి, సీత, ఏరియా పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రూ.3.85 లక్షలు పంపిణీ



ప్రజాశక్తి-గన్నవరం : పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం ముస్తాబాద పాలకేంద్రం అధ్యక్షుడు కడియాల గోపాలరావు (కోటయ్య) ఆధ్వర్యంలో స్థానిక పాల ఉత్పత్తిదారులు 145 మందికి రూ.3.85 లక్షల రూపాయలు బోనస్‌ను ఆయన రైతులకు పంపిణీ చేశారు. వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడుతూ పాల ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు, రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు కుటుంబాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేస్తున్నామని వివరించారు. పాల ఉత్పత్తి మరింత పెంచేందుకు రైతులు కృషి చేయాలని సూచించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఎండి కొల్లి ఈశ్వర్రాబు, జీఎం అనిల్ కుమార్, డైరెక్టర్ పాలడుగు నాని, రూట్ మేనేజర్ కిలారి కిరణ్కుమార్, సూపర్వైజర్ అనిల్ కుమార్, వేతన కార్యదర్శి ఆర్జా సత్యన్నారాయణ, గ్రామ ప్రముఖులు కడియాల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద పాలకేంద్రంను అభివృద్ధి బాటలో నడిపించిన కోటయ్య సేవలను కొనియాడారు.




'ఉపాధి' పని దినాలు పెంచాలి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు పోరాటం ఉధృతం చేయాలని మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మండలంలోని ఉలవలపూడి గ్రామంలో ఉపాధి హామీ కూలి కూలీలతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, 200 రోజులు పని దినాలు చూపించాలని, రోజుకు 600 రూపాయలు కూలి .ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా పమర్తి శ్రీరామ్మూర్తి, కార్యదర్శిగా మొదుగు గుమ్మడి శివకీర్తి, సహాయ కార్యదర్శిగా పామర్తి రాజ్యలక్ష్మి, కమిటీ సభ్యులుగా సూరగని ఆదిలక్ష్మి, దోకిపర్తి రమణమ్మ, పామర్తి సుబ్బమ్మ, అరిపల్లి సాంబశివరావు, యార్లగడ్డ వెంకటేశ్వరమ్మ, ఉయ్యూరు వెంకటేశ్వరరావు, కారుమంచి గణేష్‌లను ఎన్నుకున్నారు. ఎఫ్ఏకు 26 వేలు,మేట్స్‌కి 10 వేలు జీతం ఇవ్వాలని, పలుగు, పారా, మంచినీరూ తదితర సౌకర్యాలను గతంలో మాదిరిగా పునరుద్ధరించాలని, ఆన్ లైన్ మాస్టర్ విధానం రద్దు చేయాలంటూ తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదించారు.

పటిష్టమైన ప్రణాళికతో రికార్డు ఫలితాలు

- వికెఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు



ప్రజాశక్తి- గన్నవరం : విద్యార్థుల్లో నిబిడీకృతమైన సజనాత్మకత శక్తిని వెలికితీయటం ద్వారా వారిలో ఆల్‌రౌండ్ డెవలప్మెంట్ సాధించేలా నిరంతరం కృషిచేస్తున్న విద్యాసంస్థల్లో గన్నవరం 'వేములపల్లి కోదండ రామయ్య కళాశాల (వీకెఆర్ కళాశాల) ఒకటని చెప్పొచ్చని ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు చెప్పారు. విజ్ఞానం అందించే పాఠాలూ.. అనుభవాలు... మొక్కల పెంపకాలు డిజిటల్ క్లాసులూ, ల్యాబులూ. కంప్యూటర్ విద్యను బోధిస్తుండటం ఇక్కడ ప్రత్యేకత అని అన్నారు. విద్యార్థుల్లో వ్యక్తిగత స్కిల్సు పెంపొందిస్తూ సమాజానికి మంచి పౌరులను అందించే కార్యశాలగా గన్నవరం వీకేఆర్ గుర్తింపు పొందిందన్నారు. మారుతున్న సమాజంలో అధునాతన డిజిటల్ టెక్నాలజీని సైతం అందిపుచ్చుకునేలా ఇక్కడి విద్యార్థులకు బోధన జరుగుతోందని ఆధ్యాపకులు, విద్యార్థులు పేర్కొన్నారు. గన్నవరం ఎయిర్పోర్టుకు ఎదురుగా, జాతీయ రహదారి పక్కన కళాశాల ప్రాంగణం మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో రూపుదిద్దు కుందన్నారు. ఈ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌళిక వసతులు అందుబాటులో ఉన్నాయని, 1969 ప్రారంభించబడి నాటి నుండి నేటి వరకు పాఠ్య, పాఠ్యేతరాంశాలతో పాటు సృజనాత్మక, పరిశీలనాత్మక, క్రీడా పద్ధతుల్లో బోధన జరుగుతోం దన్నారు. ఏటేటా ఈ కళాశాలలో ఇంటర్మీడియట్, డిగ్రీ, బిబిఏ వంటి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులు రికార్డు ఫలితాలు సాధిస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్లో పాటు డిగ్రీలో నాణ్యమైన ఉన్నత విద్యా బోధనతో పాటు క్రీడా, సాహిత్య సామాజిక విషయాలను, విద్యార్థులకు అందిస్తోందన్నారు.


సహకార బ్యాంకు అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి-గన్నవరం : బుద్ధవరం పరిధిలోని రైతు లకు సహకార సేవలు అందించడంలో ఎంతో కృషి చేసిన సహకార బ్యాంకు అధ్యక్షులు కష్టయ్యను మంగళవారం ఘనంగా సన్మానించారు. సహకార సొసైటీ అధ్యక్షులుగా పదవీకాలం ముగించుకున్న కష్టయ్య అభినందన కార్యక్రమం జరిగింది. సొసైటీ కార్యదర్శి బాలాజీ, సిబ్బంది, రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


కృష్ణయ్యను సన్మానిస్తున్న దృశ్యం

ఎల్ఇడి స్క్రీన్ల ఏర్పాటు

ప్రజాశక్తి-పెదపారుపూడి : సీఎం నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ శ్రీకారం చూడడానికి లైవ్ ద్వారా ఏర్పాట్లు చేశామని ఎంపీడీవో.టి. సీతామహాలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం కేసరపల్లి ఐటి పార్క్ దగ్గర జరుగుతున్న చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం మండలంలోని 9 సచివాలయాల వద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశామని, మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కూడా ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు.


విద్యుత్ వెలుగుల్లో సచివాలయం



విజేతలను అభినందిస్తున్న మాజీ హోమ్ మంత్రి వసంత నాగేశ్వరరావు

విజేతలకు అభినందన

ప్రజాశక్తి- నందిగామ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోస్టర్ తయారీ పోటీలో విజేతలను మాజీ హోమ్ మంత్రి వసంత నాగేశ్వరరావు అభినందించారు. నగర, పట్టణ ప్రాంత విద్యార్థులతో పోటీపడి జిల్లాలో ప్రథమస్థానం పొందడం ఐతవరం గ్రామానికే గర్వకారణం అని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో కూడా సైన్స్ సబ్జెక్ట్‌లో రాష్ట్రంలో వసంత జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచినందుకు అభినందించారు. రాబోయే కాలంలో వసంత జడ్‌పిహెచ్ విద్యార్థులు విద్యాపరంగా మరిన్ని అద్భుతాలు చేయాలని వారు ఆకాంక్షించారు. పోస్టర్ తయారీలో జిల్లా ప్రథమ బహుమతి గ్రహీత బత్తుల కావేరిని, కన్సోలేషన్ బహుమతి పొందిన వరిగల అనుష్కను, ఉపాధ్యాయుడు గైడ్ టీచర్ బండారు లక్ష్మీనారాయణను వసంత అభినందించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :

జగ్గయ్యపేట పట్టణానికి గత వేసవి కాలం నుండే నీటి సమస్య ప్రజలను వెంటాడుతూనే ఉందని సిపిఐ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం విడుదల చేసిన పత్రిక ప్రకటన విడుదల చేశారు. పూర్వ కాలంలో కావడి పట్టుకొని పాలేరులో చిన్న చిన్న సెలలు తవ్వుకొని నీటిని వాడుకునే వారని ఇప్పుడూ అంతే దారుణమైన పరిస్థితి ఉందని అన్నారు. ఎంతమంది నాయకులు వచ్చినా ఎండాకాలం వచ్చే సరికి పాలేరులో నీరు అందక ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కృష్ణా వాటర్‌ని పట్టణ ప్రజలకు తాగునీరుగా అందించాలనే నినాదాన్ని ముందుకు తీసుకొని వచ్చామని అన్నారు. దీనితో జగ్గయ్యపేట పట్టణ ప్రజలకు కృష్ణా జలాలను సైతం తాగునీరుగా అందుబాటులోకి తీసుకువస్తే నీటి సమస్య తీరుతుందిలే అనుకుంటే పాత పైపులు పాడయ్యాయన్నారు. వాటి మరమ్మతులతో, జనరేటర్ సౌకర్యం ఉన్నప్పటికి కరెంటు కోతలతో వాటర్ ట్యాంకులను నింపలేకపోతున్నారన్నారు. ముక్త్యాలలో కృష్ణా నదిలో నీటిమట్టం తగ్గుముఖం పడటంతో కృష్ణానది సైతం పిల్లకాల్వగా మారడంతో కష్ణా నదిపై ఏర్పాటు చేసిన బావులలోకి నీరు అందే పరిస్థితులు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించకుంటే మున్సిపాలిటీపై నీటి ఎద్దడిని ఎదురుకుంటున్న ప్రజలతో ఆందోళన, పోరాటాన్ని చేస్తామని హెచ్చరించారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - వత్సవాయి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. చంద్ర బాబుపై అభిమానంతో వాటి లక్ష్మణ్ ఖమ్మం టిడిపి కార్యాలయం నుండి సైకిల్‌పై మంగళవారం బయలుదేరాడు. చంద్రబాబు అంటే తనకు విపరీతమైన అభిమానమని లక్ష్మణ్ మక్కపేటలో తెలిపారు. బుధవారం ప్రమాణ స్వీకారం టైంకు ముందుగా విజయవాడ చేరుకోనున్నట్లు తెలిపారు. గతంలో కూడా అభిమానంతో సైకిల్‌పై సూర్యాపేట నుండి హైదరాబాదు వెళ్లినట్లు చెప్పాడు.





పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

కొలికపూడి విజయంపై పాదయాత్ర

ప్రజాశక్తి - తిరువూరు :

తిరువూరు నియోజకవర్గ శాసనసభ్యుడిగా భారీ మెజార్టీతో ఎన్‌డిఎ కూటమి అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు విజయంపై ఏ.కొండూరు మండలం కంభంపాడు సెంటర్‌లో జనసేనా, మాదిగ యువసేన నాయకులు మంగళవారం కేక్‌కట్ చేశారు. అనంతరం కంభంపాడు నుండి పుట్రేల మారెమ్మ ఆలయానికి జనసేన నాయకులు పాదయాత్ర నిరహించారు. కూటమి అధికారంలోకి వచ్చింది ఈ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని మాదిగ యవసేన నాయకులు శీలం సుదీర్ కామర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేనా పార్టీ నాయకులు మనుబోలు శ్రీనివాసరావు, వెంపాటి ఏసు తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల కంచె తొలగింపు

ప్రజాశక్తి - తిరువూరు :

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని తిరువూరు నుండి అక్కపాలెం వెళ్లే రహదారికి ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు మోక్షం కలిగించారు. సొంత నిధులతో జేసిబితో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్ల కంచె తొలగింపు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. త్వరలోనే రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపట్టి ప్రజలకు రాకపోకలకు సౌకర్యం కలిగిస్తానని ఎంఎల్‌ఎ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గద్దె వెంకటేశ్వరరావు, చెరుకూరి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పనులు చేయిస్తున్న కొలికపూడి శ్రీనివాస్

అరాచకాలు చేస్తున్నారనడం హాస్యాస్పదం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : టిడిపి వాళ్ళు అరాచకం చేస్తున్నారని అనడం హాస్యాస్పదంగా ఉందని ఆ నాయకులు అన్నారు. పట్టణంలోని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నివాసంలో మంగళవారం టిడిపి నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రెస్‌మీట్ పెట్టి ఏ పార్టీ వారు ఈ నియోజకవర్గంలో గొడవలకు పాల్పడుతున్నారనేది ప్రజలను అడిగితే చెప్తారన్నారు. అందుకు ఉదాహరణగా వత్సవాయి మండలం డబ్బాకుపల్లి గ్రామంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ బూత్‌లకు చొచ్చుకొని వచ్చి టిడిపి వారిని దాడి చేసి రక్త గాయాలు చేశారన్నారు. దాడిచేసే వైసిపి మురా నాయకులని, రౌడీ మూకలను ప్రోత్సహించే వైసిపి నాయకులకు తగిన బుద్ధి చెప్తామన్నారు. ఈ సందర్భంగా కట్టా వెంకట నరసింహారావు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతూ ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత కూడా జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామంలో పొంగల్ అనే టిడిపి కార్యకర్తపై దాడి చేసింది వైసీపీ వారు కాదా అని ప్రశ్నించారు? ఇకనైనా గ్రామాలలో మీ వైసీపీ వారి అరాచకాలు మానుకోమని మీ కార్యకర్తలకు చెప్పండి లేదంటే దానికి ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, ఎలమంచిలి రాఘవ, గడ్డం హుస్సేన్ (ఏసుబాబు), యానాల గోపీచంద్, అడుసుమల్లి ప్రభాకర్, పెంట్యాల శ్రీనివాసరావు, కుక్కల వెంకటేశ్వర్లు, సూర్యదేవర బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

టిడిపి విజయోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడు మైనార్టీలకు అండగా ఉంటుందని, చంద్రబాబుతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమని తెలిపారు. టిడిపి నాయకులు, కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పశ్చిమ ఇబ్రహీంపట్నం 20వ వార్డులో టిడిపి ఘనవిజయాన్ని పురస్కరించుకొని విజయోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, మున్సిపాలిటీ టిడిపి చైర్మన్ అభ్యర్థి చెన్నుబోయిన చిట్టిబాబు, మండల అధ్యక్షుడు రామినేని రాజా, కౌన్సిలర్ చనుమొలు నారాయణ పాల్గొన్నారు. స్థానిక జండా సెంటర్ చెట్టు వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం మసీదు సెంటర్లో భారీ కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద ముస్లింకు టిడిపి అండగా ఉంటుందని, మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం టిడిపి ప్రభుత్వంలోనే సాధ్యమని తెలిపారు. స్థానిక ముస్లిం నాయకులు మాట్లాడుతూ గత పాలనలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎన్నో సంక్షేమ పథకాలు రద్దు చేయబడ్డాయని, వాటి పునరుద్ధరణతో మళ్ళీ ముస్లింలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. అతిథులను ముస్లిం సోదరులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ముస్లిం నాయకులు షేక్ సర్వర్ సాహెబ్, ముస్తఫా, షకీల్, కరీముల్లా, గాల్షిద్, మహబూబ్ సుభాని, రఫీ, షరీఫ్, హజారి తదితరులు పాల్గొన్నారు.



విజయోత్సవంలో అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

చీరాల ఎంఎల్‌ఎను కలిసిన కూటమి సభ్యులు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం :

కేతనకొండ గ్రామంలో ఆర్కే కాలేజీ అధినేత చీరాల అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే. ఎం.ఎం. కొండయ్యను కేతనకొండ గ్రామ కూటమి అధ్యక్షులు బిజెపి గ్రామ అధ్య క్షులు పయ్యావుల రాము, జనసేన అధ్య క్షులు. కొమ్మూరు వెంకట స్వామి మర్యాద పూర్వ కంగా కలిశారు. చీరాల అసెంబ్లీ నియోజకవర్గం ఎంఎల్‌ఎగా అఖండ విజయం సాధించిన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి అధ్యక్షులు కొమ్మూరి గోపి.మాజీ సర్పంచ్ పత్రి లేపాక్షి రావు, మాజీ సర్పంచ్, పులి వెంకటేశ్వర్లు కలిసిన వారిలో ఉన్నారు.



ఎంఎల్‌ఎను కలిసిన కూటమి సభ్యులు



వర సిద్ధి వినాయక వార్షిక మహోత్సవాలు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో పాత బస్టాండ్‌లో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ పదో వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ అర్చక స్వాములు రఘు శర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ తదితర పూజలు నిర్వహించారు. శ్రీ సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి కళ్యాణం, గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల టెండర్, బహిరంగ కౌలు వేలం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం దాములూరు కూడలి గ్రామంలో శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15వ తేదీ శనివారంస్వామివారి భూములకు టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఫణి కుమార్ తెలిపారు. దేవాదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా స్వామివారికి చెందిన దాములూరు వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామాల శివారులోని య.3.67 సెంట్ల భూములకు ఉదయం 10 గంటలకు జరిగే కౌలు బహిరంగ వేలంపాటలో ఆసక్తికర రైతులు పాల్గొన్నారు. నందిగామ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో 15వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ఫణి కుమార్ తెలిపారు. ప్రజలు ఈ హుండీ కానుకలో లెక్కింపులో పాల్గొన వచ్చు అని కోరారు.

టైలర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణంలో టైలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. రామ్ రహీం వెల్ఫర్ సొసైటీ పేరుతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ఆరుగురు సభ్యులతో ఈ సొసైటీ ఏర్పాటు చేశారు. ప్రెసిడెంట్‌గా మార్గాన్ని భాస్కరరావు వైస్ ప్రెసిడెంట్ గా షేక్. బాజీ సెక్రటరీగా రామిరెడ్డి నరసింహారావు జాయింట్ సెక్రటరీగా ఎస్.కె అజ్గర్ కోశాధికారిగా పఠాన్ కరిముల్లా గౌరవాధ్యక్షులుగా టి.జగన్నాథంను ఎన్నుకున్నారు. పట్టణ టైలర్స్ అసోసియేషన్ అభ్యున్నతకు దోహదపడతామని అన్నివేళలా వారందరికీ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు సలహాలు అందిస్తామని నూతన కార్యవర్గం తెలిపారు.



నందిగామలో నూతనంగా ఎన్నికైన టైలర్స్

జిఒ117ను రద్దు చేయాలి

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు : ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగాన్ని అస్థవ్యస్థం చేసి, పేద విద్యార్థులను బడికి దూరం చేసిన జిఒ 117ను రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం యుటిఎఫ్ గుంటూరు జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం గుంటూరు బ్రాడీపేటలోని సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు బి.ఆదిలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కొత్త విద్యార్థులను బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం క్యాంపెయిన్‌కు పిలుపు ఇవ్వాలని కోరారు. ఉపాధ్యాయులు సామాజిక బాధ్యతతో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. జిఒ 117 వల్ల 14200 పాఠశాలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. దాదాపు లక్షన్నర మంది విద్యార్థులు బడికి దూరం అయ్యారన్నారు. కావున ప్రభుత్వ హామీ ప్రకారం జిఒ 117ను రద్దు చేయాలని కోరారు. అలాగే 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటన్నిటినీ భర్తీ చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంచి, బోధనకే పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మెగా డిఎస్‌సి నిజంగా మెగా డిఎస్‌సిగా ఉండాలంటే 25వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని, ప్రాథమిక పాఠశాలలను 1-5 తరగతులతోనే కొనసాగించాలని కోరారు. తెలుగు మీడియం కూడా కొనసాగించాలని, పిల్లలకు మీడియంను ఎన్నుకునే స్వేచ్ఛ ఉండాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమకుమారి, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్, జిల్లా సహాధ్యక్షులు ఏఎల్.శివపార్వతి, కోశాధికారి గయాసుద్దౌలా, గౌరవాధ్యక్షులు పి.వి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి : టిడిపి జాతీయ అధ్యక్షులు, మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నారా లోకేష్ ఎన్నికలకు ముందు మంగళగిరిలో చేసిన పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. సిపిఎం పట్టణ కమిటీ సమావేశం మంగళవారం రాత్రి కొట్టె కరుణాకరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో 25 వేల మంది ఇళ్లపట్టాలు, ఇళ్లస్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. రైల్వే స్థలాల్లో ఉంటున్న మరో 1100 కుటుంబాలు కూడా రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గత కృష్ణా పుష్కరాల సందర్భంగా ఇళ్లు తొలగించిన పేదలకు నేటికీ పక్కా స్థలాలు ఇవ్వలేదన్నారు. వీరు కాకుండా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న వేలాది మంది పేదలకు ఇళ్లపట్టాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. అర్హులందరికీ ఇళ్లస్థలాలు, పట్టాలు ఇస్తామని, ఇరిగేషన్ భూముల్లో ఉంటున్న వారికి రెగ్యులరైజేషన్ చేస్తామని, రైల్వేస్థలాల పేదలకు న్యాయం చేస్తామని లోకేష్ హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ మేరకు తాడేపల్లి పట్టణంలోని సీతానగరంలో శిలాఫలకం కూడా వేశారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం పేదలకు న్యాయం చేస్తే లోకేష్‌ను ప్రజలు గుర్తుపెట్టుకుంటారని తెలిపారు. కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం టిడిపిపై ఆధారపడిన సంగతిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించబోమని కేంద్రం నుంచి హామీ పొందడం, రాజధాని అమరావతికి నిధులు సమకూర్చుకుని యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడం, కడప ఉక్కు ఫ్యాక్టరీ తదితర హామీలను అమలు జరిపించుకోవడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక రాజాగారి తోటలోని విత్తనదుకాణాలలో ఎడిఎ సునీత నేతృత్వంలో గుంటూరు వ్యవసాయ సంచాలకులు ఎం.సునీల్‌తో కలిసి వ్యవసాయశాఖ విత్తన తనిఖీ బృందం మంగళవారం పలు దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, గోడౌన్‌లోని నిల్వలతో సరిపోల్చారు. శ్రీహైకో సీడ్స్, శ్రీవెంకటసాయి సీడ్స్, శ్రీకీర్తి కాటన్ సీడ్స్, తరుణ్ హైబ్రిడ్ సీడ్స్, లక్ష్మీ శ్రీనివాస సీడ్స్, విజేత సీడ్స్ కార్పొరేషన్ దుకాణాలతో తనిఖీలు చేపట్టారు. సోర్స్ సర్టిఫికెట్ చూపని కారణంగా రూ.6300ల విలువైన 12 రకాల కూరగాయల విత్తన ప్యాకెట్లను శ్రీవెంకటసాయి సీడ్స్‌లో అమ్మకం నిలుపుదల చేశారు. షోకాజు నోటీసులు జారీ చేసి, వివరణ కోరనున్నట్లు తెలిపారు. ఎంఆర్‌పికి మించి, విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరి ంచారు. రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్లకు సూచిం చారు. ఈ తనిఖీలలో అర్బన్ వ్యవసాయాధికారి బి.అంజిరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

- **రేపటి నుండి పాఠశాలలు పున:ప్రారంభం**

ప్రజాశక్తి - విజయవాడ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్.చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు, ట్రాఫిక్ సమస్యలు ఎదురు కాకుండా ఉండేందుకు విజయవాడ నగరం, విజయవాడ రూరల్ పరిధిలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డ్ ప్రైవేటు విద్యా సంస్థలతో సహా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు స్థానికంగా సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ సూచనలు పాటించాలని కోరారు. 2024-2025 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 13వ తేదీ నుండి అన్ని పాఠశాలలను తిరిగి తెరవాలని పాఠశాల విద్యా శాఖ మెమో కూడా ఇచ్చినట్లు తెలిపారు.

టిజెపిఎస్‌లో ముగిసిన వేసవి క్రీడా శిబిరం



ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక టిజెపియస్ కళాశాలలో గతనెల రోజులనుండి జరుగుతున్న వేసవి క్రీడా శిబిరం మంగళవారం ముగిసింది. ఈముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల సెక్రటరీ, కరెస్పాండంట్ కె.వి.బ్రహ్మం హాజరై మాట్లాడుతూ వేగంగా మారుతున్న కాలంలో టెక్నాలజీ ఉచ్చులోపడి ఎంతో మంది విద్యార్థులు వారి అమూల్యమైన జీవితాన్ని వధా చేసుకుంటున్నారని, సమయం దొరికితే చరవాణిలలో నిమగ్నమై వారి లక్ష్యాలను మరచిపోతున్నారని, ఆ మాయ వల ఉచ్చులో పడకుండా వారి జీవితాలను మంచి మార్గంవైపు వెళ్లేలా చూసే బాధ్యత తల్లితండ్రులది, గురువులదని చెప్పారు. కాబట్టి వేసవి సెలవుల్లో తమ కళాశాలలో ఏర్పాటు చేసిన క్రికెట్, కబడ్డీ, చెస్, అథ్లెటిక్స్ వివిధ రకాల ఆటలలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వివిధ రకాల ఆటలలో శిక్షణ తీసుకున్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందచేశారు. ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన వ్యాయామ అధ్యాపకులు ఆర్.శివాజిని, వివిధ ఆటలలో శిక్షణ ఇచ్చిన కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ.భానుమురళి, యన్.యస్. యస్.ప్రోగ్రాం అధికారి డాక్టర్.జె.వి. సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్టూడెంట్ టీచర్స్ ఎడ్యుకేషన్ పేరెంట్స్(స్టెప్) ఆధ్వర్యంలో ఈనెల 15, 16 తేదీల్లో తుళ్లూరు మండలం నెక్కల్లులో నిర్వహిస్తున్న ఉచిత వ్యక్తిత్వ వికాస తరగతుల్ని జయప్రదం చేయాలని స్టెప్ ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తుల క్రిష్ణయ్య, రాష్ట్ర కోఆర్డినేటర్ కె.పావని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కొరిటపాడులోని స్టెప్ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ ఉచిత వ్యక్తిత్వ వికాస శిక్షణను వినియోగించుకోవాలని, హాజరయ్యే వారికి ఉచిత భోజన, వసతి ఏర్పాటు చేసి, నిష్ణాతులైన సైకాలజిస్టులు, వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. కరపత్రం ఆవిష్కరణలో ధర్మారెడ్డి, శరత్, మల్లిఖార్జున్, సతీష్‌బాబు, రామేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇతర వివరాల కోసం 9666813833, 7386883244 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న కృష్ణయ్య తదితరులు

విద్యుద్ఘాతంతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - విజయవాడ : కష్ణలంక శంకర్ మఠం లైన్‌లో బహుళ అంతస్తుల నిర్మాణంలో పనిచేస్తున్న కప్ బోర్డు పనులు చేసే కార్మికుడు నీలయ్య విద్యుద్ఘాతానికి బలయ్యాడు. తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మతుడు విజయనగరం జిల్లాకు చెందిన వలస కార్మికుడని తెలిసింది.

విఎంసి మాజీ డిప్యూటీ మేయర్ కారు ధ్వంసం

ప్రజాశక్తి - విజయవాడ : మాజీ డిప్యుటీ మేయర్ గోగుల రమణారావు కారును గుర్తు తెలియని దుండుగులు ధ్వంసం చేశారు. రూ.60 వేల వరకు నష్టం వాటిల్లినట్లు గోగుల రమణారావు అజిత్ సింగ్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజ్ వైర్లు తొలగించి ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇటీవలే ఆయన టిడిపి నుండి మాజీ ఎంపీ కేశినేని నానితో కలిసి వైసిపిలోకి వెళ్లారు.

ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేయాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలకు ఇచ్చిన హామీలను టిడిపి నేతత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం అమలు చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.ప్రసాద్, కె.పోలారి కోరారు. మంగళవారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు మరోసారి పునరావతం కాకుండా చూడాలని కోరారు. కార్మిక, రైతు, కూలీ, ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థి, యువజన, మహిళా రంగాలకిచ్చిన పలు హామీలను, సామాజికంగా అణచివేతకు గురౌతున్న దళిత, ఆదివాసీ, మైనారిటీ, మహిళా రంగాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.

పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ డివిజన్ పరిధిలో ఇంజినీరింగ్ పనులు జరుగుతున్నందున పలు రైళ్ల రద్దు చేస్తున్నట్లు గుంటూరు మండల రైల్వే అధికారి తెలిపారు. ఈనెల 21 నుంచి ఆగస్టు 12వ తేదీ వరకు విజయవాడ- (07628), -(07786), రేపల్లె- తెనాలి (07873), తెనాలి-విజయవాడ (07630) రైళ్లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి ఆగస్టు 13వ తేదీ వరకు విజయవాడ-మాచర్ల (07781) రైళ్లు నడవబోవని తెలిపారు.



గంగిశెట్టి బాబూరావు వర్ధంతి

ప్రజాశక్తి - విజయవాడ : నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగిశెట్టి బాబురావుకు మంగళవారం ఘన నివాళులర్పించారు. కాంగ్రెస్ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గంగిశెట్టి బాబురావు 2వ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్ వలి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, ఎపిసిసి ఉపాధ్యక్షులు వి.గురునాథం, ధనేకుల మురళి, కొలనుకొండ శివాజీ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, గంగిశెట్టి బాబురావు కుమారులు ఉమామహేశ్వరరావు (అయ్యప్ప), శివరాము తదితరులు పాల్గొన్నారు.



మాడుగుల నాగఫణి శర్మ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు తదితరులు

దుర్గమ్మను దర్శించుకున్న నాగఫణి శర్మ

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను ప్రముఖ ద్విసహస్ర (సంస్కృతం, తెలుగు) అవధాని బ్రహ్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆలయానికి విచ్చేశారు. శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహనాధికారి వారు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



పన్నీర్ సెల్వంకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఇఓ రామారావు తదితరులు

ఇంద్రకీలాద్రికి పన్నీర్ సెల్వం

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకునేందుకు తమిళనాడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం మంగళవారం శ్రీ అమ్మవారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కెఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీఅమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వీరికి వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ కార్యనిర్వాహణాధికారి వారు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ ఇఒ ఆలయ ప్రాశస్త్యతను, పండుగల విశేషములను గురించి తెలియజేశారు.

ఎపిఇఎపి సెట్‌లో 75 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఎన్‌టిఆర్ జిల్లాలో 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎపిఇఎపి టెస్ట్ 2024 ఎన్‌టిఆర్ జిల్లాలో మూడు చోట్ల జరిగింది. జిల్లాలో మైలవరం, తిరువూరు నందు ఒకొక్క సెంటర్లో పరీక్ష జరగ్గా, విజయవాడ సెంటర్ నందు 10 కేంద్రాలలో పరీక్ష జరిగింది. జిల్లా వ్యాప్తంగా 16,630 మంది హాజరుకాగా ఇంజినీరింగులో 75.51 శాతం, అగ్రికల్చర్‌కి సంబంధించి 87.11 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత ఏడాదితో చూస్తే, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఇఎపి సెట్ 2024 కౌన్సెలింగ్ జూలై రెండో వారం జరుగుతుందని అధికారులు తెలిపారు.

ప్రమాణ స్వీకార సభ ప్రాంగణం పరిశీలన

నాయకులు, అధికారులకు ఎంపి చిన్ని సలహాలు, సూచనలు

విజయవాడ : టిడిపి అధినేత, ఎన్డీయే కూటమి శాసనసభా పక్ష నేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేయబోయే ప్రమాణ స్వీకార మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. గన్నవరం మండలం కేసరపల్లి మేధ టవర్స్ పక్కన ఉన్న 17 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవ పనులు, సభా వేదికను మంగళవారం కేశినేని శివనాథ్, ఎంఎల్‌సి మంతెన వెంకట సత్యనారాయణరాజుతో కలిసి పర్యవేక్షించారు. స్టేజ్ ముందు ఏర్పాటు చేసిన వివిఐపి, విఐపి గ్యాలరీలను పరిశీలించి అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలకు తాగునీటి సప్లై, పారిశుద్ధ్య నిర్వహణ గురించి అధికారులతో మాట్లాడి ఆ వివరాలు తెలుసుకున్నారు. ఇక ప్రోటోకాల్ పరంగా ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఎదురవకుండా చూడాలని పోలీసులు ఉన్నతాధికారులకు సూచించారు. సభా ప్రాంగణం మొత్తం తిరిగి జరుగుతున్న పనులను పరిశీలించటంతోపాటు, వివిధ రాష్ట్రాల నుంచి రాబోతున్న నాయకుల కోసం ఏర్పాటు చేసిన వసతి సదుపాయలను కూడా పరిశీలించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవం ఒక పండుగ వాతావరణంలా జరగాలని నాయకులకు, అధికారులకు సూచించి... అందుకు కావాల్సిన విధంగా ఎక్కడ ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని కోరారు.



సభా ప్రాంగణం పరిశీలిస్తున్న చిన్ని తదితరులు

విద్యా రంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే

ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి - కంచికచర్ల : ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రస్తుత తరుణంలో కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయుల మీదే ఉందని ఎమ్మెల్సీ కెయస్ లక్ష్మణరావు అన్నారు. కంచికచర్లలో నన్నపనేని కల్యాణ మండపంలో మంగళవారం యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో మమేకమై బాధ్యతాయుతంగా పనిచేసి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ రంగం ఉండటం వల్ల ఇప్పటికీ పేదలు బడుగు బలహీన వర్గాలు, దళితులు, గిరిజనులు, కొంతమేర చదువుకొని పైకి రావడానికి అవకాశం ఏర్పడిందన్నారు. నూతన ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యారంగానికి, ప్రైవేట్ విద్యా రంగం పోటీ పెరగటం వల్ల కొంతమంది ప్రైవేట్ విద్యా రంగం వైపు వెళ్లడం జరుగిందన్నారు. ఖాళీగా ఉన్న 30 వేల టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం విద్యారంగానికి గొడ్డలి పెట్టుగా ఉన్న 117 జీవో రద్దుచేసి ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ని ప్రాథమిక స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా జాతీయ పతాకాన్ని, యుటిఎఫ్ పథకాన్ని సీనియర్ నాయకులు కె.సంజీవరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.సుందరయ్య కార్యదర్శి నివేదిక ప్రవేశ పెడుతూ గత ఆరు నెలల నుంచి జిల్లాలో జరిగిన విద్యారంగ అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు చేసిన పోరాటాలు, ఉపాధ్యాయ సంక్షేమం కోసం యూ.టి.ఎఫ్ చేసిన పోరాటాలు వివరించి భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధి, సంఘం అభివృద్ధి రెండు నేత్రాలుగా ఉపాధ్యాయ పని ఉండాలని చెపుతూ ఆయన నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరావు, ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య, జిల్లా సహాధ్యక్షులు ఎం.కృష్ణయ్య, డి.అపర్ణ, జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, జిల్లా కోశాధికారి పి.నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి కె.గంగరాజు, ఆడిట్ కమిటీ సభ్యులు పులి శ్రీనివాసరావు, ఎల్.చంటి, మండలం నాయకులు కె.నాగేశ్వరరావు, ఎం.రామరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు

మొక్కులు తీర్చుకున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ :

కూటమి ఘనవిజయం సాధించిన సందర్భంగా మంగళవారం సారిపల్లి వినయ్, దేవర కళ్యాణ్‌లు అమ్మవారికి మొక్కుబడి తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాండ్రేగుల రవీంద్ర, 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), ఈగల సాంబ, సుకాసి కిరణ్ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి ముందుగానే అమరావతిలో అభివద్ధి పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. టిడిపి అభిమానులు, కార్యకర్తలు కాకుండా ప్రజలు కూడా బాబు పాలనే కావాలనుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తమను కూడా భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. కూటమి పాలనలో రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో ఉంటారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండారు బాబురావు, గోలి శ్రీనివాసరావు, నాగోతి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.




అమ్మవారికి మొక్కులు తీర్చుకున్న టిడిపి నాయకులు

ఎపి ఇఎపిసెట్ - 2024 ఫలితాలలో

శ్రీ చైతన్య విద్యా సంస్థల విజయభేరి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ :

ఎపిఇఎపి సెట్ - 2024 ప్రవేశ పరీక్షలో విజయవాడ శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు అద్భుతమైన విజయాలు సాధించారని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ ఎజిఎం మద్దినేని మురళీకృష్ణ తెలిపారు ఎం.జి.రోడ్డులోని శ్రీ చైతన్య కళాశాలలో మంగళవారం ఉదయం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యార్థులు అగ్రికల్చర్ విభాగంలో స్టేట్ 2వ ర్యాంకుతో పాటు టాప్ ర్యాంకులు సాధించారన్నారు. పి.దివ్య తేజ రెండో ర్యాంకు, వి.ముకేష్ చౌదరి మూడో ర్యాంకు, పి.సాత్విక్ 4వ ర్యాంకు, పి.ప్రణీత 5వ ర్యాంకు, జి.భాను తేజ సాయి 6వ ర్యాంకు, సాధించారని తెలిపారు. ఇంజనీరింగ్ ఫలితాలలో పి.సతీష్ రెడ్డి 4వ ర్యాంకు, జి.లేఖ హర్షా7వ ర్యాంకు సాధించారన్నారు. శ్రీ చైతన్య విద్యార్థులు విజయవాడ జోన్ నుండి ఇంజనీరింగ్ విభాగంలో 10లోపు రెండు ర్యాంకులు, 50 లోపు 20 ర్యాంకులు, 100లోపు 29 ర్యాంకులు సాధించారని తెలిపారు. అగ్రికల్చరల్ విభాగంలో 10లోప 5 ర్యాంకులు, 50 లోపు 17 ర్యాంకులు, 100లోపు 31 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈవిజయానికి శ్రీ చైతన్య విద్యా సంస్థలు అనుసరిస్తున్న ఇంజనీరింగ్ ఎన్‌పిఎల్, నియాన్, మెడికల్ విభాగంలో ఎంపిఎల్ అండ్ మెఇకాన్ ప్రోగ్రామ్‌ల వల్లనే సాధ్యమైందని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు.



భానుతేజ



దివ్యతేజ



హర్ష



ముఖేష్



ప్రణీత



సతీష్ రెడ్డి